
# కవ్వింత కథలు

## -వేదాంతం శ్రీపతిశర్మ



(ముందుగా ఓ మాట)

**అందమైన** ఆలోచనలన్నీ సాహితీ వినీలాకాశంలో తారల వలె ప్రభవిస్తూనే ఉంటాయి. ఒకటి పద్యం, ఇంకొకటి కథ, ఒకటి నాటకం, ఇంకొకటి నవల, ఒకటి వ్యాసం, ఇంకొకటి కవిత, మరొకటి కావ్యం.. ఇలా మనసును చంద్రుడిగా మలచినప్పుడు చుట్టూతా మెరిసేవన్నీ ఆలోచనల నక్షత్రాలే. కాకపోతే ఈ 'తారాశశాంకం' అందరినీ ఒకలాగే అలరిస్తుంది అనుకోవటం సరికాదు. ఒక్కొక్కరికి ఒక్కో నక్షత్రం సరిపోయినట్లు ఒక్కొక్కరి మనస్తత్వం ప్రకారం ఒక్కో సాహితీ ప్రక్రియ ఆనందాన్ని అందించటం సహజం.

ఆలోచనల అంతరంగం ఒక తరంగంలా సాగి శబ్దాలను తాకి పదజాలంలోకి అల్లుకుని ఒక రంగవల్లిలా రంగరించుకున్న వేళ కవిత్వం అనేది పద్యంలా కనిపించవచ్చు, కవితలా అనిపించవచ్చు.. కథలా కూడా దర్శనమివ్వవచ్చు.

అవధాన ప్రక్రియలో సమస్యాపూరణంలాగా, దృశ్యకావ్యం లేదా నాటక ప్రక్రియలో గర్భాన్ని ఆవిష్కరించే విధంగా కవితకు కథ వ్రాయటం అనేది తెలుగు సాహిత్యంలో ఒక వినూత్నమైన ప్రయోగం! 'కవిత' అనే పేరుగల అమ్మాయి రచయితకు తన కవిత ద్వారా పరిచయం అవుతుంది. అమ్మాయి అందిస్తున్న కవితలకు రచయిత కథలను సృజించి ఆమెకు మెయిల్ చేస్తూ అంటాడు. అలా పరిచయం పెరుగుతూ ఉంటుంది. కవిత తన కవితలో పలు అంశాలను స్పృశిస్తూ అంటుంది. ఇవి ఎక్కువగా స్త్రీ పురుష సంబంధాలు, బంధాలు, అనుబంధాలు, రాగద్వేషాలు, సౌందర్యారాధన, తప్పించుకోలేని జీవిత సత్యాలు.. కానీ ఎన్నో విషయాలు రసవత్తరంగా సాగిపోతూ ఉంటాయి.

కవిత రచయితను సవాలు చేస్తోందా లేక పరీక్షిస్తోందా లేక తన స్థాయిలో జీవిత భాగస్వామిని ఎంచుకుంటోందా అనే ఆలోచనలు కలుగుతాయి. ఇటు ప్రక్క రచయిత తన కథలలో అందించిన కవితలోని ప్రాణాన్ని పైకి చూపుతూనే సరికొత్త పరిస్థితులను ఎత్తి చూపటం కూడా జరుగుతూ ఉంటుంది.

కవితలోని వృత్తం, కథలోని ఇతివృత్తం కొన్ని సందర్భాలలో మమేకం కావటం, కొన్ని సందర్భాలలో సమానాంతరంగా సాగటం జరుగుతాయి. కవిత కోసం కథ వ్రాయటం అనేది కత్తిమీద సాములాంటిది. సామాజికపరమైన సంఘటనలను సృష్టించాలా లేక సహజంగా ఉన్నవాటిని మాలికలా అల్లి 'కవిత'ను ముగ్గులోకి దింపాలా అనేది విషయాన్ని ఆధారం చేసుకుని రచయిత ఎంచుకోవలసిన మార్గం.

కవితకు కథ అనే ప్రక్రియలోని కవ్వింత వింతగానే మిగిలిపోతుందా, ఇద్దరికీ ఈ రసవత్తర స్థాయిలో అనుబంధం ఏర్పడుతుందా అనేది చివరి వరకు కవ్విస్తూనే ఉంటుంది.

వేదాంతం వేంకట సత్యవతి యిస్తున్న కవితలకు కథలను వేదాంతం శ్రీపతిశర్మ అందిస్తున్నారు.

****

## కుటుంబం

**కవితలు, కథలు** అన్నింటినీ బంగారు దుకాణంలో ఏదో చంద్రహారాన్ని అద్దం ముందర అమర్చి చూసుకుంటున్నట్లు చూసుకుంటున్నాను.

'ఏదో వెతుక్కుంటున్నట్లున్నారు?' వినపడింది.

వెనక్కి తిరిగాను. ఏ మాత్రం శబ్దం చేయకుండా ఎప్పుడో వచ్చేసి వెనుకే నిలబడి ఉంది కవిత.

'నువ్వొచ్చాక ఇంక దేనిని వెతకాలి?'

చేతి బాగ్ అలా టేబిల్ మీద పెట్టి అలా కూర్చుంది.

'అంటే? నన్ను వెతకమనా?'

'కాదు. ఈ కాగితాలలో కవితను ఇక వెతకనక్కరలేదు కదా!'

'ఓ.'

'ఒక ఆలోచన వస్తోంది.'

'ఏంటి?'

'ఈ తెల్లకాగితాలమీద కనిపిస్తున్న ఈ అక్షరాలన్నీ మన పరివారమే కదా!'

'నిజమే. ఒక్కో శీర్షిక క్రింద కట్టుకున్న ఒక్కోగూడు. అన్నిటికీ రెక్కలు వచ్చేసినట్లున్నాయి'

'కవితలోని పదాలు, పదజాలాలు, భావాలు...నీవైపు బంధువులు, కథలోని సంఘటనలు, వాక్యాలు, నావైపు బంధువులు.'

'బావుంది'

'రెండు కుటుంబాలూ ఎంతగా కలిసిపోయాయో చూడు!'

'నిజమే

'ఇంక పెళ్లి ఎందుకసలు?'

తన మోచేతిని టేబిల్‌మీద పెట్టి పిడికిలితో బుగ్గను నొక్కుతూ నన్ను అదోలా చూసింది. ఇప్పుడే ముదిరిందా ఈ రోగం లేక బాగా ముదరటం వలన ఇప్పుడు బయట పడుతోందా అని సూటిగా అడగటం సమంజసం కాదేమో అనుకున్నప్పుడు ఆడవాళ్లు సామాన్యంగా అలా చూస్తారని ఒకళ్లిద్దరు ముగ్గురికి చెబుతుండగా నాలుగో మనిషిగా నేను వినటం జరిగింది.

'మరి ఏం చేద్దాం?' అడిగింది.

'ముహూర్తం నిర్ణయించి తాంబూలాలు పుచ్చుకున్నారు కదా?'

'అవును. అయితే పెళ్లయిపోయినట్లేనా?'

'నో నో. ఆ ముహూర్తం రోజున స్టేజ్ మీద అందరం నిలబడి మేం కలసిపోయాం. ఈ ముహూర్తానికి ఆ ప్రకటన చేస్తున్నాం అని చెప్పి వెళ్లిపోదాం. ఈ ఖర్చు ఎందుకు?'

'ఊ... బాగుంది. బట్టల షాప్ వాళ్లని, జువెలరీ వాళ్లనీ అందరినీ బాగు చేసేసాం కదా! ఇంకెందుకు?'

'లేదు కవితా! అక్షరాలా కలసిన ఆలోచనలు బంధువులలా సాక్షాత్కరిస్తే ఎలా ఉంటుందో చూడాలి కదా? అందుకైనా పెళ్లి అనే విధానం జరుపుకోవాలి'

'లక్షల మాట ఇది'

'శభాష్. అయితే అక్షమాలలా ఓ కవిత చెప్పు'

ఓసారి కాగితాలన్నీ ప్రేమగా చూసింది కవిత.

'వసంతుడు ఎదురు వెళ్ళి మల్లె తీగని మురిపించాడు...' కవిత కవిత వినిపించింది...

*'వసంతుడు ఎదురు వెళ్ళి మల్లె తీగెని మురిపించాడు*
*అది నాకూ సమ్మతమేనంటూ*
*మావిరెప్ప తల ఊపింది*
*కోకిలమ్మ చివుళ్ళు వేగిరంగా కొమ్మ కొమ్మని చుట్టుకున్నాయి.*
*అలుపులేని కాలచక్రం ఉత్సాహంగా రెమ్మరెమ్మని పూయించింది.*
*ఈ ఎదురు కొలువుకి ఎంతమంది పెద్దలో... అందరి మోమున చిరునవ్వులే!*
*అందరి చేయూత అందంతో అమరింది.*
*ఇదంతా దేనికోసం?*
*కవ్వింత కంటికింపుగా వుండేటందుకే మరి!*
*మరో కుటుంబం ముచ్చటగా కొలువుతీరేందుకేనా?*

## *ఎదురు కొలువు*

సుకుమారికి ఏ రోజైనా ముందర ఆగ్రహం, తరువాత గ్రహాలమీద చర్చ, ఆ చివర పూర్తి నిశ్శబ్దం అలవాటై కూర్చున్నాయి. పురుషోత్తమరావు పేరుకు తగ్గ ఉత్తముడూ కాడు, అన్నింటినీ సమర్ధించుకోగల పురుషుడూ కాడు. పెళ్లయిపోయి నూట ఎనభై రోజులు దాటి ఒక పూట పూర్తయింది. అంత నిక్కచ్చిగా లెక్క వెయ్యటం మటుకు ఈ భార్యాభర్తలు పెళ్లయినప్పటినుండే చక్కగా చేసుకుంటున్న పని! చాకలి పద్దుకూడా బహుశః అంత కరెక్ట్‌గా వేసి ఉండరు అలా అని ఇద్దరూ అసలు పరస్పరం మాట్లాడుకోరా అనుకోవటం పొరపాటు. ఒక్కోసారి అర్ధరాత్రి దాటిపోయి కూడా ఇక పాలవాడు వచ్చేస్తాడు అనే టైంకి కూడా చర్చించుకున్న రోజులున్నాయి. అయితే భార్యాభర్తలు చర్చించుకోకూడని విషయం అది... అదేమిటంటే మనం ఇలా పోట్లాడుకుంటూ ఎన్నిరోజులు కరెక్ట్‌గా కలిసి ఉండగలము అనే అంశం మీద సమాలోచన ప్రారంభం అయి, మరో ఆలోచనగా మారి, నీ లెక్క తప్పంటే నీ లెక్క తప్పు అని అనుకుని, ఎన్ని లెక్కలు తప్పు అయినప్పటికీ ఇలా కనీసం ఈ విషయంలోనైనా ఒక మాట మీదకి మనం రాలేకపోయాం కాబట్టి అన్ని లెక్కలూ తప్పే అనుకుని ఈ రాత్రితో ఈ వైవాహిక జీవితానికి దీర్ఘవిరామం - ఫుల్‌స్టాప్ పెడదామని నిర్ణయించుకుంటూ ఉంటారు.

ఉదయమే ఆ పని చేసే అమ్మాయి వచ్చి బెల్ నొక్కి ఎవరూ తలుపు తెరవపోయేసరికి 'ఊ.. మళ్లీ మొదలు' అనుకుని ఏదో చేతనైన పని చేసేసి వెళ్లిపోతుంది.

ఉత్తముడు లేచి అటూ ఇటూ తిరిగాడు అలాంటి ఉదయాన్నే ఈ రోజు.

తమ్ముడు వెల్లూరులో చదువుతానన్నాడు. హైదరాబాదులో కూడా సీటు వచ్చింది. ఇక్కడే చదవమంటుంది సుకుమారి. పైగా మన ఇంట్లోనే ఉంటూ చదవమంటుంది. కుర్రాళ్లు హాస్టల్‌లో ఉంటే తనకి భయం. డబ్బు ఖర్చు అన్న మాటమీద కాదు అని వాదిస్తుంది.

టి.వీ పెట్టి మ్యూట్ చేసాడు. కుమారి పడుకుంటే మనసు కుదుటపడుతుందని ఉత్తముడు ఎక్కువగా ఉత్తమంగా ఆలోచిస్తూ ఉంటాడు. బెడ్‌రూం తలుపు వైపు చూస్తూ అలా టి.వీలో వార్తలు గమనిస్తున్నాడు. ఏదైనా మాట కాదంటే చాలు చాలా దూరం

ప్రయాణం కట్టేస్తుంది ఈ అమ్మాయి. తలుపు చిన్నగా తెరుచుకుని టక్కున మూసుకుంది. టి.వీలో వార్తలు కూడా మూసుకున్నాయి. ఒక బిస్కెట్ కలర్ సూట్‌కేస్ ముందు ఇవతలకి వచ్చింది. తరువాత చక్కగా ముస్తాబయిన కుమారి వచ్చి పెట్టె అలా పెట్టింది.

'నావల్ల కాదు', చిన్నగా చెప్పింది.

'ఏమైపోయిందని?' మెల్లగానే అడిగాడు.

'నా మాటకు విలువలేని చోట నేనెందుకు?'

'లోక్‌సభ స్పీకర్ మాటకే విలువలేదు. అలా చూడు'

'ఇదే నాకు నచ్చనిది. అన్నీ నవ్వులాటలాగా ఉంటాయి. నేనూ ఓ మనిషిని. అయినా నేను వాదించను.'

'ఏం చేస్తావు?'

'వెళ్లిపోతాను.మీరు'

'ఎక్కడికి?'

'తెలియదు. ఎందుకు చెప్పాలి?'

'చెప్పాలేమో ఆలోచించు'

'నో. నేను ఆలోచించను'

'కాఫీ సంగతేమిటి?'

'వంటిల్లుంది, పొడుంది, పంచదారుంది.'

'నువ్వు తాగవా?'

'మీకనవసరం'

కాలింగ్ బెల్ మ్రోగింది. ఉత్తమ్ లేచి తలుపు తీసాడు. లుంగీ, షర్ట్, ఓ టవల్‌తో ఓ పెద్దాయన నిలబడున్నాడు. చిన్నసైజు ఫైవ్‌స్టార్ చాక్‌లెట్ సైజు విభూతి నుదుటి మీద మెరుస్తోంది.

**'నారా...యా...అన్.....కరక్....చిక్'** అని చేతులు కలిపాడు. డాక్టర్లు వాడే బాగ్ ఒకటి కనిపిస్తోంది. మనిషి ఎవరో అర్థంకాలేదు. భాష తమాషాగా ఉంది. ఇలాంటి అర్థంకాని వ్యవహారం ఎక్కువగా ఈ కుమారి తాలూకా వారిదై ఉంటుందని అటు చూసాడు. అక్కడ మరో పెట్టె ప్రక్కన నా సంగతేమిటి అన్నట్లు ఆమె నిలబడుంది. ఆలోచించే లోపల లోపలికి వచ్చి ఫాన్ కూడా ఆన్ చేసి సోఫాలో కూర్చున్నాడు. ఉత్తమ్‌కి ఇప్పటికీ ఫాన్ స్విచ్ బదులు లైట్ స్విచ్ వేసే అలవాటుంది.

'మీరా...'

**'నారా...యా...చిక్ చిక్.... మారిపో...త?ఎ... '**

'నా పేరు ఉత్తమ్. మీరు...'

చప్పట్లు కొట్టాడు. 'కలకలపోయి.. ఇట్టా.. ఎట్టా?'

అన్నాడు. కుమారి తన గదిలోకి పారిపోయింది. ఇతను చూస్తే వింతగా మాట్లాడుతూ చూసావా ఎంత గొప్ప విషయం చెప్పానో అన్నట్లు ఓ నవ్వు కూడా నవ్వుతున్నాడు. ఏమీ చెయ్యలేక గదిలోకి వెళ్లాడు.

'ఇదిగో, నీ మావయ్యో, పెదనాన్నో అనుకుంటా, ఊరినుంచి వచ్చినట్లున్నాడు', అన్నాడు. కుమారి అప్పటివరకూ తనలో తాను నవ్వుకుంటూ ఉంది. వెంటనే సీరియస్ అయింది. చెయ్యి చూపించింది. 'ఇదిగో, నాకు ఇలాంటి వాళ్లెవరూ బంధువులు లేరు. మీ వైపు చుట్టమే ఎవరో..'

'నాకు ఈయనెవరో తెలియదు'

'కూర్చో పెట్టారుగా! ఏం కావాలో చేసి పెట్టండి.'

మరల హాల్లోకి వచ్చాడు. ఆయన చెయ్యి ఉపదేశం చేస్తున్నట్లు పెట్టాడు.

**'కావలి...కొక్కా... కరిషాక్ చిక్. అల్లా' అన్నాడు.**

'ఎక్కడినుండి వచ్చారు సార్!'

ఎందుకో టైలర్‌లా కాలు ఆడించటం మొదలెట్టాడు.

**'రాన్...కారంకోవ...కల్లారి చిక్'** అన్నాడు. ఉత్తమ్ నమస్కారం పెట్టాడు.

'కరెక్ట్‌గా చెప్పండి సార్. నాకేమీ అర్థం కావటంలేదు' అతను ఎందుకో ఈ మాత్రం తెలియదా అన్నట్లు తల బాదుకున్నాడు.

**'కిల్ జిడ్స్ కార్.. అల్లా'**

కుమారి నవ్వు ఆపుకుంటూనే వంటింట్లోకి వెళ్లింది. ఆయన లేచి టి.వి రిమోట్ తీసుకుని టకటకా చానెల్స్ అన్నీ మార్చేసి ఒక చానెల్ దగ్గిర ఆగాడు. వెనక్కి తిరిగాడు. టి.వి అస్సలు బాగాలేదన్నట్లు తల అడ్డంగా ఉపాడు.

**'సరై.. కావ...చాన్ చిక్...నో'** అన్నాడు.

వచ్చి సోఫాలో కూర్చున్నాడు. ఉత్తమ్ గదిలోకి వెళ్లి కంప్యూటర్‌లో ఉన్న పెళ్లి తాలూకు ఫోటోలన్నీ టకటకా చూసాడు. ఎక్కడా ఇలాంటి శాల్తీ కనిపించనేలేదు. ఇదేదో రాంగ్ నంబర్. రాంగ్ అడ్రస్‌కి వచ్చినట్లుంది.

మరల హాల్లోకి వచ్చాడు. కుమారి ఏమనుకుందో ఏమో, కాఫీ తీసుకుని వచ్చి అలా టీపాయ్ మీద పెట్టింది. అది తీసుకుని ఆమెను ఓ చూపు చూసాడు. ఎందుకో టపటపా కన్నీళ్లు కార్చేసాడు. కుమారి జుట్టు నిమిరాడు.

**'కాలం..కావలిన...కార్ సిక్...తే!'** అంటూ తనలో తాను ఎందుకో బాధపడిపోయాడు!

సంచీలోంచి ఏవో గాజులు తీసి ఇచ్చాడు.

'నేను మిమ్మల్ని గుర్తుపట్టలేదు' చెప్పింది కుమారి.

**'చిక్కరీస్ చికోరి చిక్..అయ్యో'** అన్నాడు.

ఆ చివరి మాట ఒక్కటీ అర్థమైంది. కాకపోతే ఇద్దరికీ అంతా పూర్తిగా అర్థమైనట్లు ఆయన ఎంతో గర్వపడుతున్నట్లు కనిపిస్తోంది. కుమారి లోపలికి వెళ్లిపోయింది. కూర్చోమని ఉత్తమ్‌కి మర్యాద చేసేసాడు అతిథి.

'ఆఫీస్‌కి వెళ్లాలి...మీరు...'

'ఆఫీ...పో...కావాలికచ్చా, కరెక్ట్ చిక్,' అంటూ వాచ్ చూస్కున్నాడు. అటూ ఇటూ చూసి సోఫాలోని దిండు సర్దుకుని కాళ్లు జాపేసి చక్కగా నిద్రపోయాడు.

'ఆఫీసుకు వెళ్లటానికి వీల్లేదు..', కుమారి శాసించింది.

'ఆయనెవరో నాకు తెలియదు!'

అదీ నిజమే. ఈ చిక్ చిక్‌ని ఏం చేయాలో తెలియటం లేదు...

'కాఫీ పెట్టినందుకు థాంక్స్', లోపలికెళ్లి మెల్లగా అన్నాడు.

'మీకు ఇవ్వలేదుగా?'

'అంటే?'

'వచ్చినవారికి మర్యాద. దట్సాల్'

'ఆయనెవరో తెలియటంలేదు.'

'నాకెందుకు?'

'ఇంతకీ ఆ పెట్టె లోపల పెట్టి వంట చేసెయ్. ఓ పని అయిపోతుంది'

'నో.'

'ఆ పెద్దాయన కోసం చెయ్యవా?'

'ఆయనెవరో కనుక్కుని నాకు వివరం చెప్పి ఆఫీసుకు వెళ్లిపోండి. ఆయనకి కావలసినవన్నీ చేసి పెడతాను.'

'అది నావల్ల కావటంలేదు సుక్కూ.'

'చిన్నపని కావటంలేదు. నేనంటే విలువలేదు. అసలు ఏమనుకుంటున్నారు?'

'ఇంట్లో కూరలున్నాయా?'

'ఏవో ఉన్నాయి. ఈయన ఏం తింటారో ఏమో?'

'అడిగితే చైనీస్‌లో మాట్లాడుతున్నాడు. చిక్ చిక్ అంటాడు. చిక్కీలు రైటేమో!'

'ఖచ్చితంగా మీ చుట్టమే. సరైన భాష కూడాలేదు. అర్థం లేకుండా మాట్లాడడం'

'కాదు. నీ వైపే. అర్థంకాకుండా మాట్లాడటం!'

'సరే. ఇప్పుడు ఈ గోలెందుకు? ఆ టమాటలు తీసుకుని చట్నీ చెయ్యి. ఓ పనైపోతుంది!'

'మీకు కావలసినది ఆయన మీద ఎందుకు రుద్దటం? తప్పకుండా చేస్తాను. కానీ మీరు ఈ రోజు కాంటీన్‌లో తింటే ఎందుకో తెలియదు కానీ సంతోషంగా ఉంటుంది!'

ఉత్తమ్ హాల్లోకి వచ్చాడు. ఆడవాళ్లు నీరసంతో నిరసన ప్రదర్శిస్తారని విన్నాడు. ఇలా నీరసం తెప్పిస్తారని అనుకోలేదు. చిక్ చిక్ నడుము వాల్చటం ఏంటి, నాలుగో గేరు టచ్ చేసేసాడు. ఎవరై ఉంటారూ ఈ కారెక్టర్? ఆ బాగ్ తెరచి సామానంతా చూస్తే తెలిసిపోతుందేమో! బాగుండదనుకున్నాడు. మొబైల్ తీసి ఫోటో తీసి తన మేనమామకి పంపాడు. ఆ మెసేజ్ క్రింద ఏదో అడగబోయే ముందరే ఓ మెసేజ్ వచ్చింది.

'ఆఫీసునుండి తప్పిపోయాడా?' అని.

ఉత్తమ్ జవాబుగా వ్రాసాడు. 'ఈయనెవరైనా మన బంధువా?' కొద్దిసేపటికి కాల్ వచ్చింది.

'హలో'

'ఒరేయ్, బంధువో కాదో అలా ఉంచు. ఇప్పుడెందుకు అడుగుతున్నావు?'

'ఇంటికి వచ్చి పడుకున్నాడు

'వార్ని. నీకు చెప్పలేదా? సరిగ్గా అడుగు. ఎవరిల్లో మరి!' 'నేను సరిగ్గానే అడిగాను. ఆయనా చెప్పాడు. ఆ భాష మటుకు అర్థంకావటంలేదు.'

'మతి స్థిమితం పోయినవాడేమో చూడు'

'చక్కగా చిక్కని కాఫీ త్రాగాడు'

'బావుంది నీ గోల. కాఫీ త్రాగేవాళ్లందరూ మతిస్థిమితం ఉన్నవాళ్లని అర్థమా? మీ అత్తయ్య ఆరుసార్లు త్రాగుతుంది'

'నాకలా కనిపించటంలేదు. ఈవిడకి గాజులు కూడా ఇచ్చాడు'

'ఛా. అమ్మాయివైపు చుట్టంలేరా. మెల్లగా కనుక్కో, దూరపు చుట్టాలైనా ఈ మధ్య ఓ పూట తలదాచుకోవటం కోసం అలా వస్తూ ఉంటారు. కొద్దిగా ఆ టి.వీ ఛానెల్ వాడిలాగా ఇంటర్వ్యూ చేసి నిజంలాగు.'

'అలా జరగటం కష్టంగా ఉంది. మాట్లాడే ముందర సౌండ్ చేస్తారు చూడూ, ఆ శబ్దాన్ని భాషగా వాడుకుంటున్నాడు'

'ఎవరో మొనగాడురా.'

'అమ్మాయేమో ఆయనొక్కరికే వంట చేస్తానంటోంది'

'ఇప్పుడు పాయింట్‌కి వచ్చావు. నీకు తెలియకుండా పిలిపించింది ఆలోచించు'

'ఇది నిజంగానే ఆలోచించాలి. నువ్వు జీనియస్‌వి. మళ్లీ ఫోన్ చేస్తాను.'

పెట్టేసాడు.

అటువైపు కూడా ఆ ఫోటో ఎవరికో వెళ్లింది.

'ఇలాంటివి షేర్ చెయ్యకు' అని మెసేజ్ వచ్చింది.

'ఈయనెవరో తెలుసా?' అని ఈమె అడిగింది.

ఇద్దరూ సమాధానం ఇచ్చారు.

'ఆ మధ్య నీళ్లతో పెట్రోల్ చేసినాయన' అని ఒకటి,

'ఈ మధ్య జైలుకెళ్లి ఇవతలకి వచ్చిన ఓ నిత్యానంద బాబా' అని రెండవది.

'మనకు సంబంధీకులా?', అని అడిగింది.

'ససేమిరా! మీ ఆయనకు చెప్పి పంపించేయ్.. ఆయన వైపు వాళ్లయితే నీ ఇష్టం!'

ఉత్తమ్ అటూ ఇటూ పచార్లు కొట్టాడు. కుమారి వంటింట్లోకి వెళ్లింది. ఏవో సద్దుకుని స్నానానికి వెళ్లిపోయింది. పడుకునున్న చిక్‌చిక్‌కి మనసులోనే సెల్యూట్ కొట్టాడు ఉత్తమ్.

మరో పెట్టె ప్రహసనం ఇప్పటికి ఆగింది అనుకున్నాడు.

ఇంతలోనే అతిథి లేచాడు. బాగా అలవాటున్న ఇంటిని చూసినట్లు చుట్టూతా చూసి ఇలాంటి ఇళ్లు కరెక్ట్ కావన్నట్లు ఎందుకో తల అటూ ఇటూ ఊపాడు. ఉత్తమ్‌ని జాగ్రత్తగా చూసాడు.

'ఆఫీ...క్కరలే..తక్?' అడిగాడు.

చిక్ చిక్ నుండి ఒక్క నిద్రలో కథక్ కి వచ్చాడెందుకో బోధపడలేదు.

'ఇవాళ ఆఫీసుకు వెళ్లటంలేదండీ', అన్నాడు.

ఓహో అన్నట్లు చేతులు కట్టుకున్నాడు. అరె, ఈయన మాట అర్థమైపోయిందే అనుకుని ఎక్కడలేని ఉత్సాహం తెచ్చుకున్నాడు.

'సార్, మీరు ఎక్కడనుండి వచ్చారు? మనం ఒకరినొకరు ఏమవుతాం?', అడిగాడు.

ఆయన నిలబడ్డాడు. లుంగీ సరిజేసుకున్నాడు. వాళ్ల ఊరు వాకిట్లోనే ఉన్నట్లు అటు చూపించాడు.

'కావ క్రర కర్ కర్ కా?ఆ...భిరావ్ కచ్చికల్‌కి చిక్!' అనేసాడు ఒక్క ఊపిరిలో. మరల చెక్ పెట్టినట్లుంది ఉత్తమ్‌కి!

'మీరు నాకు ఏమవుతారండీ ఇంతకీ?'

నోరు తెరచి అవమానం జరిగినట్లు కొద్దిగా ఆగి బాధ చూపించాడు.

'పా...పాలకా... కర్ కట్'

మైకు టెస్ట్ చేస్తూ ఆంప్లిఫెయర్‌ను సద్దినప్పుడు ఓ చిత్రమైన శబ్దం వస్తుంది. అది ఈయనకు సహజంగా వస్తుందని గ్రహించాడు. మర్యాదగా తల ఊపాడు. ఆయన సంతోషంగా గుండెమీద చెయ్యిపెట్టాడు. చుట్టరికం అర్థమైనందుకో లేక ఆయన భాష ఈ భూమి మీద ఒక్కరికైనా పూర్తిగా అర్థమైనందుకో తెలియలేదు. చిన్నప్పటినుండీ అన్నట్లు చెయ్యి నేలమీదకి మూడడుగుల దూరంలో పెట్టాడు.

ఉత్తమ్ వంటింట్లోకి వెళ్లాడు. ఏదో లోపల పాడుకుంటోంది. ఆలోచించాడు. మావయ్య చెప్పింది కరెక్ట్. ప్లాన్ ప్రకారం నడుస్తోంది కథ అనుకున్నాడు. కాకపోతే ఉదయం త్వరగానే స్నానం చేసేస్తే ఆడవాళ్లకి అలక ఎక్కువసేపు ఉండదేమోనని అనుకున్నాడు. అలా అనుకున్నట్లుగానే 'ఏమి తేలింది?' అడిగింది.

'కొద్దిగా అర్థమవుతోంది' అన్నాడు.

'ఏమర్థమవుతోంది?' అటు తిరిగి కూర తరుగుతూనే అడిగింది.

'చిన్నప్పుడు ఒక్కసారి ఎందుకో ఎత్తుకున్నాడుట'

కుమారి నవ్వింది.

'ఏమైంది?'

'అది కాదు నేనడిగింది. నేను పెళ్లిపోతున్నానని చెప్పాను కదా? ఆ సంగతి ఏమి తేలింది అని అడుగుతున్నాను. కాదు. నిలదీస్తున్నాను'

'నిలబడే ఉన్నానుగానీ, అంత పెద్దవి కావు, కొద్దిగా చిన్నవిగా తరుగు'

'మీకెందుకు?'

'అదేంటి?'

'ఇదంతా ఆయనగారికి'

'సరె. వడ్డించుకో నే వెళతాను.'

'గుడ్'

ఈసారి కుమారి హాల్లోకి వచ్చింది.

'మరో కప్పు కాఫీ తీసుకుంటారా?' అడిగింది ఉత్తమ్‌ని ఏడిపించటానికి. అలాగే అన్నట్లు తల ఆడించాడు. వంటింట్లోకి వెళుతుంటే వెనుకనుండి వినిపించింది...

'పంచదార కొద్దిగా తగ్గించమ్మా'

'అలాగే' అంటూ ఏదో గుర్తుకొచ్చి వెనక్కి తిరిగింది. మాటలు రావనుకున్న పిల్లవాడికి అమాంతం మాటలు వచ్చినప్పుడు చిందులు వేసిన తల్లిదండ్రులలాగా ఇద్దరూ ఆయన ఎదురుగా కూర్చున్నారు.

'ఇందాకటినుంచీ ఇలా ఎందుకు మాట్లాడలేదండీ?'

'తమాషాగా'

'చంపేసారు.'

'ఇంతకీ అలా ఎందుకు చేసారండీ?', ఉత్తమ్ అడిగాడు.

'రాత్రి మీ నంబరుకు కాల్ చేసాను. హలో అని వినిపించింది గానీ ఆ తర్వాత మీ ఇద్దరూ ఊరికే వాదించుకోవటం అంతా విన్నాను'

'ఓ. ఆ కాల్ మీదా? గొడవలో పడి మరచి పోయాను'

'ఊ. నాకు మీ గోల అర్ధమైంది. ఇద్దరికీ చెబుతున్నాను వినండి'

ఇద్దరూ ఒకళ్ల నొకళ్లు చూసుకుని ఆయన వైపు తిరిగారు.

'భార్యాభర్తల మధ్య గొడవలు ఎలాంటివో తెలుసా? అర్ధంపర్ధంలేనివి. నేను ఇందాకటినుండీ మాట్లాడుతున్నాను చూడండీ, అలాంటివి.'

ఆ హాల్లో నిశ్శబ్దం ఆవరించింది.

'ఏం లేదండీ...', ఉత్తమ్ చెప్పాడు. '..... నా తమ్ముడు...' ఆయన చెయ్యి అడ్డం పెట్టాడు.

'చూడండీ. నాకు తెలుసు. మీ ఆవిడ చిన్నప్పుడు మా బంధువుల్లోనే ఓ అబ్బాయి హాస్టల్లో ఉంటూ ఉరేసుకున్నాడు. ఆమెకు అదీ భయం. ఆ ఆలోచన వచ్చినప్పుడల్లా అలా భయపడిపోయి వద్దు, వద్దు అంటుంది'

కుమారి తల దించుకుంది.

'అందరికీ అలా ఎందుకవుతుందండీ?' ఉత్తమ్ అడిగాడు.

'అసలు సమస్యే లేదు...', ఆయన చెప్పాడు '.....నేనుండేది వెల్లూరులోనే, మా ఇంట్లో ఉండి చదువుకుంటాడు. చాలా?'

'ఏంటి? మీరు వెల్లూరు నుండి వచ్చారా?'

'అవునూ. నా పేరు నారాయణ. కాకపోతే ప్రాంతీయంగా నారాయణన్ అంటారు. మీ ఇద్దరికీ నేను బంధువునే. అంచాత ఎదురుకోలు కార్యక్రమంలో కొద్దిసేపు అటూ కొద్దిసేపు ఇటూ కూర్చున్నాము. ఏ ఫోటోలోనూ పడలేదు. గుర్తుకొస్తున్నానా?'

'గుర్తుకొస్తోంది సార్..', ఉత్తమ్ చెప్పాడు, '..కాకపోతే ఇలా లుంగీలో లేరనుకుంటాను'

'నిజమే. పాంట్ షర్ట్‌లో ఉన్నాను. చాలా కాలం క్రితం తమిళనాడులో స్థిరపడ్డాను. నా భాషకూడా కొద్దిగా భిన్నంగా ఉంటుంది!'

'కొద్దిగానా?'

ఆ మాటకు ముగ్గురూ పిచ్చిపిచ్చిగా నవ్వుకున్నారు. కాలెండర్‌లో ఏప్రిల్ ఒకటవ తేదీ మరో కథ చెబుతోంది...

నాలుగు రోజులు తరువాత నారాయణన్ గారు వెల్లూరు బయలుదేరారు. ఆటోలో సామాను పెట్టి ఆశీర్వదించారు.

'చూడమ్మా...' చెప్పారు '...ఎదురుకోలు అంటే ఏదో జీబ్రా క్రాసింగ్ మీద అటు నలుగురూ ఇటు నలుగురూ అటూ ఇటూ జరిగిపోవటంకాదు. రెండు కుటుంబాలు, వారి కుటుంబాలు.. ఇలా ఒక పరివారం పూర్తిగా కలిసిపోయి బంధుత్వాలను గట్టిపరచుకోవటం అని అర్ధం. నీ మరిది పట్ల నీ బాధ చెబుతుంది నిజమైన బంధుత్వం గురించి. నువ్వు నాకు నచ్చావు! వస్తాను ఉత్తమ్....ఫోన్లు చేస్తూ ఉండండి. నీ వాళ్లూ, నా వాళ్లూ అనే ఆనవాళ్లు లేనిది నిజమైన బంధుత్వం!' ఆటో డ్రైవర్ కూడా ఎందుకో తల ఊపి స్టార్ట్ చేసాడు. వీధి చివరిదాకా వెళ్లేవరకూ ఆయనను చూస్తూ నిలబడ్డారు. మెల్లగా ఇంట్లోకి వెళ్లి కూర్చున్నారు.

'కా...కా..కాఫీ చిక్స్', అన్నాడు ఉత్తమ్!

***(కవిత అందించిన వారు వేదాంతం వేంకట సత్యవతి)***

Post your comments

*(వచ్చేనెల మరో కవితకి మరో కథ - కవ్వింత కథ!)*